క్లుప్తంగా

పెండింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి

కోవూరు : పెండింగ్ కేసుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని నెల్లూరు రూరల్ డీఎస్పీ వీరాంజనేయరెడ్డి తెలిపారు. కోవూరు పోలీస్‌స్టేషన్‌ను మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్‌కు సంబంధించిన పలు రికార్డులు పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. సకాలంలో పెండింగ్ కేసులను పరిష్కరించి దోషులకు శిక్షలు పడేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా వివిధ కేసులకు సంబంధించి ముద్దాయిలను సకాలంలో అరెస్టు చేసి వారిని కోర్టుకు హాజరు పరిచేలా దృష్టి సారించాలన్నారు. రాత్రి వేళల్లో గస్తీలు పెంచి చోరీలు జరగకుండా చూడాలన్నారు. ఆయన వెంట ఎస్సై రంగనాథ్‌గౌడ్, హెడ్ కానిస్టేబుల్ రషీద్, వేణు తదితరులు పాల్గొన్నారు.

బాణసంచా దుకాణాలకు లైసెన్స్ తప్పనిసరి

మనుబోలు : దీపావళి సందర్భంగా బాణసంచా దుకాణాలకు లైసెన్స్ తప్పనిసరి అని ఎస్సై అజయ్‌కుమార్ తెలిపారు. మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బాణసంచా విక్రయించే వారు ముందస్తుగా అనుమతి తీసుకోవాలన్నారు. అనుమతు ల్లేకుండా బాణసంచా విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. బాణసంచా నిల్వ చేసినా, అక్రమంగా విక్రయించినా చర్యలు తప్పవన్నారు. అంతే కాకుండా దుకాణాల వద్ద తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నీరు, పొడి ఇసుక సిద్ధంగా ఉంచుకోవాలని తెలిపారు. నివాసాలు, విద్యాసంస్థలు, ఆస్పత్రులకు దూరంగా ఏర్పాటు చేసుకోవాలన్నారు. మండలంలో బాణసంచా దుకాణాల నిర్వహణకు నలుగురికి మాత్రమే అనుమతి ఇచ్చినట్లు తెలిపారు. గ్రామాల్లో విక్రయిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. టపాసులు కాల్చే సమయంలో అగ్నిప్రమాదాలు సంభవిస్తే 100, 101, 112కు కాల్ చేయాలని సూచించారు.

కారు, బైక్ ఢీ

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : మండలంలోని దామరమడుగు జాతీయ రహదారిపై కారు, బైక్ ఢీకొన్న ఘటన మంగళవారం ఉదయం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. నెల్లూరు నుంచి బుచ్చిరెడ్డిపాళెం వైపు వెళ్తున్న ఇన్నోవా కారు అదుపుతప్పి పొలాల్లోకి దూసుకెళ్లింది. అయితే డ్రైవర్ కారును రోడ్డుపైకి ఎక్కించే క్రమంలో బుచ్చి నుంచి నెల్లూరుకు బైక్‌పై వెళ్తున్న వ్యక్తిని ఢీకొట్టాడు. ఈ క్రమంలో ఇద్దరు వ్యక్తులకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు నెల్లూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

స్పందన ఫిర్యాదుపై ఆర్డీఓ పరిశీలన

విడవలూరు : మండలంలోని అలగానిపాడు గ్రామంలో ఓ రైతు ఫిర్యాదుపై కావలి ఆర్డీఓ శీనానాయక్ మంగళవారం పరిశీలించారు. ఇటీవల అలగానిపాడు గ్రామంలోని భూములకు రీసర్వే చేశారు. ఇందులో గ్రామానికి చెందిన కుంచె హనుమాయమ్మ తనకు ఉన్న భూమిలో 15 సెంట్లు తక్కువగా రెవెన్యూ అధికారుల రికార్డుల్లో ఎక్కించారని ఇటీవల కలెక్టర్ కార్యాలయంలో జగనన్నకు చెబుదాంలో ఫిర్యాదు చేశారు. ఇందులో భాగంగా భూములను పరిశీలించి బాధితురాలితో మాట్లాడామని, త్వరలో ఈ సమస్యకు పరిష్కారం చూపుతామని తహసీల్దార్ రమాదేవి తెలిపారు. ఆమె వెంట ఆర్ఐ రమేష్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఎల్లప్పుడూ నాణ్యమైన విద్యుత్ సరఫరా



మనుబోలు : రైతులకు, గృహ అవసరాలకు ఎల్లప్పుడు నాణ్యమైన విద్యుత్ సరఫరా అందిస్తున్నామని ట్రాన్స్‌కో ఏఈ ఇస్మాయిల్ అన్నారు. మండలంలోని వీరంపల్లి సబ్‌స్టేషన్‌ను ఆయన మంగళవారం పరిశీలించారు. గ్రామాలకు విద్యుత్ సరఫరా అయ్యే ఫీడర్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులకు ఏడు గంటల పాటు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేస్తున్నామన్నారు. గృహాలకు ఎటువంటి అంతరాయం లేకుండా 24 గంటల నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తున్నామని తెలిపారు. విద్యుత్‌ను వృథా చేయవద్దని, పొదుపుగా వినియోగించాలని సూచించారు. విద్యుత్ చౌర్యానికి పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట ఏడీ రవికుమార్‌రెడ్డి ఉన్నారు.

సీవీ రామన్‌ను ఆదర్శంగా తీసుకోవాలి

కోవూరు : విద్యార్థులు సర్ సీవీ రామన్‌ను ఆదర్శంగా తీసుకోవాలని హెచ్‌ఎం నరసింహమూర్తి తెలిపారు. కోవూరులోని పచ్చిపాల రామనాథమ్మ జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో సీవీరామన్ జయంతిని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం విజ్ఞాన శాస్త్రంలో రామన్ సేవల గురించి తెలియజేశారు. కార్యక్రమంలో సైన్స్ ఉపాధ్యాయులు కె.భారతి, టి.రుస్సీరాణి, ఈ.రాజేశ్వరి, విద్యార్థులు ఉన్నారు.

పన్నుల వసూళ్లలో పురోగతి చూపాలి

• కమిషనర్ వికాస్ మర్మత్



మాట్లాడుతున్న వికాస్ మర్మత్

నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థ పరిధిలో ఆస్తి, కుళాయి, డ్రైనేజీ పన్నులు, కమర్షియల్ భవనాల బకాయిలు, యూజర్ చార్జీల వసూళ్లలో నెల్లోపు పురోగతి చూపాలని కమిషనర్ వికాస్ మర్మత్ ఆదేశించారు. కార్పొరేషన్ పరిధిలోని సచివాలయ కార్యదర్శులు, ఇంజినీరింగ్, రెవెన్యూ, ఆరోగ్య విభాగాధికారులతో కస్తూర్బా కళాక్షేత్రంలో మంగళవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశానికి సకాలంలో హాజరుకాని సచివాలయ కార్యదర్శులకు షోకాజ్ నోటీసులను జారీ చేయాలని ఆదేశించారు. పన్నుల వసూళ్లలో వెనుకబడిన కార్యదర్శులు తమ పనితీరును మెరుగుపర్చుకోవాలని, లేని పక్షంలో చర్యలు తప్పవని స్పష్టం చేశారు. పన్నుల వసూళ్లపై 15 రోజులకోసారి సమీక్ష సమావేశాన్ని నిర్వహించి పురోగతిపై సమీక్షిస్తానన్నారు. బకాయిదారులకు నోటీసులు జారీ చేసి, నిర్దేశించిన గడువులోపు వసూలు చేయాలని ఆదేశించారు. కుళాయి పన్నుల వసూళ్లు చాలా తక్కువగా ఉందని, మొండి బకాయిదారులకు నోటీసులను జారీ చేసి కనెక్షన్లను తొలగించాలని చెప్పారు. మొండి బకాయిదారుల వద్ద వసూళ్ల విషయాన్ని తన దృష్టికి తీసుకొస్తే తాను హాజరవుతానని తెలిపారు. డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, ఎంహెచ్ఓ వెంకటరమణ, ఈఈలు సంజయ్, చంద్రయ్య, ప్రసాద్, రెవెన్యూ అధికారులు శ్రీనివాసులు, సమద్, రాజేశ్వరి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు కృష్ణంరాజు, కృష్ణకిషోర్, చినబాబు, కృపాకర్, శ్రీనివాసులు, సునీల్‌కుమార్, పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.



హాజరైన అధికారులు

కరువు మండలాలను ప్రకటించాలని వినతి

నెల్లూరు(దర్గామిట్ట): జిల్లాలో వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ఉపాధి కోసం వలస వెళ్తున్న రైతు కూలీలను పరిగణనలోకి తీసుకొని కరువు మండలాలను ప్రకటించాలని బీజేపీ నేత రమేష్ కోరారు. ఈ మేరకు జేసీ కూర్మనాథ్‌కు వినతిపత్రాన్ని మంగళవారం అందజేసిన అనంతరం ఆయన మాట్లాడారు. ఉదయగిరి, ఆత్మకూరు, కందుకూరు, వెంకటగిరి నియోజకవర్గాల్లో నీటి వనరులు తక్కువగా ఉన్నాయని.. సోమశిల, కండలేరు జలాశయాల్లో నీటి నిల్వలు తగినంత లేవని చెప్పారు. జిల్లాలోని 12 మండలాల్లో కరువు పరిస్థితులు తాండవిస్తున్నాయని పేర్కొన్నారు. ఏ ప్రాంతానికి నీటి వనరులు అవసరమో, అక్కడికి కేటాయించేలా ఐఏబీ సమావేశంలో తీర్మానించాలని కోరారు.



జేసీకి వినతిపత్రమిస్తున్న రమేష్

ఎంపీ వేమిరెడ్డికి సత్కారం

నెల్లూరు(దర్గామిట్ట): రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని నగరంలోని ఆయన నివాసంలో కావలికి చెందిన పాస్టర్స్ అసోసియేషన్ కమిటీ సభ్యులు మర్యాదపూర్వకంగా మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా ఎంపీని సత్కరించారు. అనంతరం పలు సమస్యలను తెలియజేయగా, వీటి పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని ఎంపీ హామీ ఇచ్చారు. అసోసియేషన్ ప్రెసిడెంట్ ఏసుబాబు, కో ఆర్డినేటర్ పాడేటి థామస్ తదితరులు పాల్గొన్నారు.



పౌష్టికాహారాన్ని తప్పక తీసుకోవాలి

నెల్లూరు సిటీ: గర్భిణులు పౌష్టికాహారాన్ని తప్పక తీసుకోవాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి వాణి పేర్కొన్నారు. శిశు రక్షణ దినోత్సవంపై అవగాహన కార్యక్రమాన్ని పొదలకూరు రోడ్డులోని అర్బన్ హెల్త్ సెంటర్‌లో ఐసీడీఎస్, ఐసీపీఎస్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ అధికారి హేనాసుజన్ మాట్లాడారు. పుట్టిన గంటలోపు శిశువుకు ముర్రుపాలను తాగించాలని సూచించారు. జిల్లా బాలల సంరక్షణాధికారి సురేష్, సీఐడబ్ల్యూసీ శ్రీనివాసులు, ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీఓ అన్నపూర్ణ, ఏసీడీపీఓ లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అధికారులు

జేవీవీ ప్రచార కార్యక్రమ పోస్టర్ల ఆవిష్కరణ

నెల్లూరు (టౌన్): జనవిజ్ఞాన వేదిక నేషనల్ సైంటిఫిక్ టెంపర్ క్యాంపెయిన్‌ను బీవీనగర్‌లోని సంఘమిత్ర విద్యాలయంలో మంగళవారం ప్రారంభించారు. తొలుత పోస్టర్లను ఆవిష్కరించారు. డాక్టర్లు శ్రీనునాయక్, కాలేషాబాషా, కళాకారులు విజయకుమార్, రమణయ్య, జేవీవీ జిల్లా అధ్యక్షుడు ఉదయ్‌భాస్కర్, జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణారెడ్డి, కోశాధికారి విద్యాచరణ్, కార్యదర్శి మాదాల రాము, రక్తదాత సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



అదనపు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): విద్యుత్ సరఫరాలో అంతరాయాల్లేకుండా అదనపు పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను మంగళవారం ప్రారంభించారు. వెంకటేశ్వరపురంలోని ఇండోర్ సబ్‌స్టేషన్లో ఇప్పటికే ఉన్న 8 ఎమ్వీఏ సామర్థ్యం కలిగిన పీటీఆర్‌కు అదనంగా మరో 5 ఎమ్వీఏను ఏర్పాటు చేశారు. వెంకటేశ్వరపురం సబ్ స్టేషన్లోని ఆరు ఫీడర్లను రెండు భాగాలుగా విభజించి పీటీఆర్లకు అనుసంధానించారు. నెల్లూరు టౌన్ – 2 డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ మధుసూదన్‌రెడ్డి, విద్యుత్ శాఖ కన్‌స్ట్రక్షన్ విభాగ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్రీధర్, ఎమ్మార్టీ విభాగ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రాఘవేంద్రం, ప్రొటెక్షన్ విభాగ ఎగ్జిక్యూటివ్ మధు, ఏఈ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ప్రారంభిస్తున్న మధుసూదన్‌రెడ్డి

కొనసాగుతున్న ధర్మప్రచార వారోత్సవాలు

నెల్లూరు రూరల్: వేదగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థాన ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న హిందూ ధర్మప్రచార వారోత్సవాలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా దేవరపాళెం గిరిజన కాలనీలోని పోలేరమ్మ ఆలయం వద్ద స్వామి, ఆదిలక్ష్మి అమ్మవారి ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేకాభిషేకాలు, పూజలు చేశారు. సుదర్శన హోమం, కుంకుమార్చన, కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. ఆలయ చైర్మన్ వేమిరెడ్డి సురేంద్రరెడ్డి, ఈఓ గిరికృష్ణ, ప్రధానార్చకుడు భాస్కరాచార్యులు తదితరులు పాల్గొన్నారు.



పోలేరమ్మ ఆలయంలో హోమాలు

విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు

నెల్లూరు (టౌన్): భౌతిక శాస్త్రంలో ఎక్కువ మార్కులు సాధించిన ముగ్గురు విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలను బీవీనగర్‌లోని జీవీఆర్ఆర్ జూనియర్ కళాశాలలో మంగళవారం అందజేశారు. నోబెల్ పురస్కార గ్రహీత సీవీ రామన్ జయంతిని పురస్కరించుకొని విశ్రాంత భౌతిక శాస్త్ర అధ్యాపకుడు సోమశేఖర్ సౌజన్యంతో వీరికి రూ.రెండు వేల చొప్పున ప్రదానం చేశారు. అనంతరం ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో సీవీ రామన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రిన్సిపల్ రవికుమార్, అధ్యాపకుడు జకీర్, ఎన్ఎస్ఎస్ పీఓ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



జాబ్ మేళా రేపు

నెల్లూరు(మినీబైపాస్): జాబ్ మేళాను గురువారం ఉదయం 10.30కు నిర్వహించనున్నామని జిల్లా ఉపాధి అధికారి రామాంజనేయులు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. క్యూట్ మేనేజ్‌మెంట్ సర్వీసెస్ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించనున్నారని చెప్పారు. టెలికాలర్, ఫీల్డ్ ఎగ్జిక్యూటివ్ పోస్టులకు పది నుంచి డిగ్రీ వరకు చదివిన, 20 నుంచి 35 ఏళ్లలోపు వారు అర్హులని చెప్పారు. ఆసక్తి గల వారు ఆటోనగర్‌లోని జిల్లా ఉపాధి కార్యాలయంలో నిర్వహించనున్న ఇంటర్వ్యూలకు హాజరుకావాలని కోరారు.

వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

కోవూరు : నియోజకవర్గ పరిధిలోని డిగ్రీ కళాశాల, ఇంజినీరింగ్ కళాశాలల్లో యువతకు ఓటు హక్కుపై అవగాహన కల్పించేలా చర్యలు తీసుకుంటున్నట్లు కోవూరు ప్రత్యేక ఎన్నికలాధికారి, నుడా వైస్ చైర్మన్ బాపిరెడ్డి అన్నారు. కోవూరులోని తహసీల్దార్ కార్యాలయంలో రాజకీయ పార్టీల నేతలతో మంగళవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల నుంచి శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారు, మృతిచెందిన వారి ఓట్లను తొలగించే విషయంలో ఎన్నికల కమిషన్ ఇచ్చిన నియమ నిబంధనలను తప్పక పాటించాలన్నారు. అదేవిధంగా 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ తమ ఓటును నమోదు చేసుకోవాలన్నారు. దీనికి సంబంధించి ప్రతి పోలింగ్ కేంద్రం పరిధిలో ఉన్న బీఎల్‌వోలు ప్రజల్లో అవగాహన కల్పించేలా ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అనంతరం ఆయన ఓటు నమోదుకు సంబంధించిన వివరాలను పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎం.పద్మజ, ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దార్ మధు, సీనియర్ అసిస్టెంట్ సుధా తదితరులు పాల్గొన్నారు.

పోలేరమ్మకు విశేష పూజలు

మనుబోలు : మండల కేంద్రంలోని కోదండరామపురం దేవాంగుల వీధిలో ఉన్న పోలేరమ్మ ఆలయంలో అమ్మవారికి మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. అర్చకుడు శ్రీనివాసులు పోలేరమ్మకు పంచామృతాభిషేకం నిర్వహించి ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. అనంతరం విశేష పూజలు జరిపించి భక్తులకు తీర్థ ప్రసాదాలు వితరణ చేశారు. సాయంత్రం మహిళలతో సామూహిక కుంకుమార్చన నిర్వహించి ధూప దీప నైవేద్యాలతో హారతులిచ్చారు. కార్యక్రమానికి ఉభయదాతలుగా గంధళ్ల కృష్ణయ్య, అన్నపూర్ణమ్మ దంపతులు వ్యవహరించారు.

బాక్సింగ్ జిల్లా జట్ల ఎంపికలు రేపు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): జిల్లా పురుషుల బాక్సింగ్ జట్లను ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో గురువారం సాయంత్రం ఐదు గంటలకు ఎంపిక చేయనున్నామని బాక్సింగ్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విశాఖపట్నంలో ఈ నెల 13 నుంచి 15 వరకు నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి బాక్సింగ్ టోర్నీలో జిల్లా తరఫున వీరు ప్రాతినిధ్యం వహించనున్నారని చెప్పారు. వివరాలకు 94415 24931, 91215 88178 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

15 నుంచి శిక్షణ తరగతులు

నెల్లూరు సిటీ: సీనియర్ ప్రొఫెషనల్ ఫస్ట్ ఎయిడ్ శిక్షణ తరగతులను ఈ నెల 15 నుంచి నిర్వహించనున్నామని రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా కో ఆర్డినేటర్ రవికుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ, సెయింట్ జాన్స్ అంబులెన్స్, న్యూఢిల్లీ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని చెప్పారు. పాల్గొనాలనుకునే వారు నగరంలోని రెడ్‌క్రాస్ కార్యాలయంలో తమ పేర్లను ఈ నెల 13లోపు నమోదు చేసుకోవాలని కోరారు. వివరాలకు 91000 78571 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

సింహపురిలో వర్షం

నగరంలో మంగళవారం ఉదయం భారీ వర్షం కురిసింది. దీంతో వాహనచోదకులు, పాదచారులు ఇబ్బందులు పడ్డారు. వర్షం కారణంగా రోడ్లు, అండర్ బ్రిడ్జిలు జలమయమయ్యాయి. – సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు



నీట మునిగిన ఆత్మకూరు బస్టాండ్ సమీపంలోని అండర్ బ్రిడ్జి



గొడుగు సాయంతో ప్రయాణం..





జలమయమైన రోడ్డు

అన్నదాతలకు అండగా రాష్ట్ర ప్రభుత్వం

• ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి



మాట్లాడుతున్న విక్రమ్‌రెడ్డి

నెల్లూరు(దర్గామిట్ట): అన్నదాతలకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అండగా నిలుస్తున్నారని.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో పెట్టుబడి సాయం కింద నగదును అందజేసి వారిని ఆదుకుంటున్నారని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి పేర్కొన్నారు. వైఎస్సార్ రైతు భరోసా – పీఎం కిసాన్ నిధుల విడుదలను పురస్కరించుకొని నగరంలోని తన క్యాంప్ కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడారు. ఆత్మకూరు నియోజకవర్గంలోని 38,086 మంది రైతులకు రూ.15.4 కోట్ల నగదు జమైందని చెప్పారు. ఆత్మకూరు మండలంలో 7149 మందికి రూ.2.9 కోట్లు, అనంతసాగరంలో 6103 మందికి రూ.2.5 కోట్లు, అనుమసముద్రంపేటలో 5687 మందికి రూ.2.3 కోట్లు, మర్రిపాడులో 7739 మందికి రూ.3.1 కోట్లు, సంగం మండలంలో 4300 మందికి రూ.1.8 కోట్లు, చేజర్లలో 7078 మందికి రూ.2.9 కోట్లు మంజూరయ్యాయని పేర్కొన్నారు. నియోజకవర్గ రైతుల తరఫున సీఎంకు కృతజ్ఞతలను తెలియజేశారు.

సమస్యలను పరిష్కరించుకుందాం

గ్రామీణ ప్రాంతాల్లో సమస్యల పరిష్కారానికి సమష్టిగా కృషి చేద్దామని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి పేర్కొన్నారు. నగరంలోని తన నివాసంలో ఏఎస్‌పేట మండలం జమ్మవరం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలతో ఆత్మీయ విందును ఎమ్మెల్యే ఏర్పాటు చేశారు.

సమీక్ష సమావేశం

ఆత్మకూరు నియోజకవర్గంలో గుర్తించిన సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలనే ఉద్దేశంతో సమీక్ష సమావేశాలను నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి పేర్కొన్నారు. ఆత్మకూరు నియోజకవర్గ రెవెన్యూ సమస్యల పరిష్కార అంశమై స్థానిక ఆర్డీఓ, తహసీల్దార్లు, ప్రజాప్రతినిధులు, రెవెన్యూ సమన్వయ కమిటీ సభ్యులతో సమీక్ష సమావేశాన్ని కలెక్టర్ హరినారాయణన్‌తో కలిసి ఎమ్మెల్యే నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట విలేకరులతో ఎమ్మెల్యే మాట్లాడారు. రానున్న రెండు, మూడు నెలల్లో రెవెన్యూ సమస్యలను పరిష్కరించేలా అధికారులు చర్యలు చేపట్టనున్నారని వివరించారు. ఆత్మకూరు పట్టణాధ్యక్షుడు అల్లారెడ్డి ఆనంద్‌రెడ్డి, సంగం మండల కన్వీనర్ పులగం శంకర్‌రెడ్డి, మర్రిపాడు మాజీ కన్వీనర్ గంగవరపు శ్రీనివాసులు నాయుడు, అనంతసాగరం జేసీఎస్ కన్వీనర్ అక్కలరెడ్డి అంకిరెడ్డి, రెవెన్యూ సమన్వయ కమిటీ సభ్యులు గడ్డం శ్రీనివాసులురెడ్డి, అంబవరపు కోటిరెడ్డి, నోటి వినయ్‌కుమార్‌రెడ్డి, హజరత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లోతట్టు ప్రాంతాల్లో ముందస్తు చర్యలు

నెల్లూరు రూరల్: వర్షాలు కురుస్తున్న తరుణంలో నగర శివారులోని లోతట్టు ప్రాంతాల్లో ముందస్తు చర్యలు చేపడుతున్నామని మేయర్ స్రవంతి పేర్కొన్నారు. కొత్తూరు పరిధిలోని 30వ డివిజన్లో గల శ్రామికనగర్ వద్ద వరద వాగును అధికారులతో కలిసి మంగళవారం ఆమె పరిశీలించారు. వర్షాల సమయంలో వాగు ద్వారా నీరు సజావుగా వెళ్లడంలేదని స్థానికులు తెలిపారు. చిన్నపాటి వర్షానికే శ్రామికనగర్, తిరుమలనగర్ ప్రాంతాలు జలమయమవుతున్నాయని చెప్పారు. కాగా ఎంపీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి సహకారంతో ఈ ప్రాంతంలోని లోతట్టు ప్రాంతాల సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. లోతట్టు ప్రాంతాలు జలమయం కాకుండా సత్వర చర్యలు చేపడతామని చెప్పారు. కార్పొరేటర్ ప్రసాద్, ఇరిగేషన్ ఏఈ బాలసుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.



వరద వాగును పరిశీలిస్తున్న స్రవంతి